క్లుప్తంగా

మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి ఇకలేరు

పెద్దాపురం: మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ బచ్చు శ్రీదేవి (80) మంగళవారం మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి ఆమె కుటుంబం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతోంది. ఆమె భర్త బచ్చు రామ్మోహనరావు పెద్దాపురం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. 1995 నుంచి 2000 సంవత్సరం వరకు ఆమె మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నో సేవలు అందించారు. ఆమె చైర్ పర్సన్‌గా పట్టణ శివారు కాలనీలో తాగు నీటి సమస్య పరిష్కారానికి బోర్లు, స్పాట్ డెలివరీ ట్యాంకులు వేయించారు. ఆమె మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఏరులై పారుతున్న మద్యం

కొత్తపల్లి: మండలంలో బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు పెరిగిపోతున్నాయి. ఎక్కడ చూసినా కిల్లీ షాపుల్లా బెల్ట్ షాపులు పెరుగుతున్నాయి. ప్రధాన కూడళ్లలో కిల్లీ షాపుల పేరుతో మద్యాన్ని విక్రయిస్తున్నారు. అధికారులకు మామూళ్లు సమర్పించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో 18 గ్రామ పంచాయతీలకు సంబంధించి వందకు పైగా బెల్ట్ షాపులు ఉన్నట్లు సమాచారం. కొంత మంది నిర్వాహకులు రాజకీయ నాయకులు అండతో నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల లైసెన్స్ బ్రాందీ షాపులు లేకపోవడంతో బెల్ట్ షాపులకు మరింత గిరాకీ పెరుగుతుంది. ముఖ్యంగా కోనపాపపేట, నాగులాపల్లి, యండపల్లి జంక్షన్, గోర్స, కొమరగిరి, కొత్తపల్లి, ఇసుకపల్లి తదితర గ్రామాల్లో ప్రధాన కూడళ్లలోని కిల్లీ షాపుల్లో యథేచ్ఛగా మద్యాన్ని విక్రయిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులకు లైసెన్స్ ఉన్న బ్రాందీ షాపులు యజమానుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయనే మహిళలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పట్టించుకోవల్సిన ఎక్సైజ్ అధికారులు ఏనాడు బెల్ట్ షాపులపై దాడులు చేసిన దాఖలాలు కనిపించడంలేదని మహిళలు ఆరోపిస్తున్నారు.

వాహనాలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు


ధ్వంసం అయిన మద్యం కేసులు

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులో మంగళవారం ఉప్పువారి సత్రం సమీపంలో ఎదురు ఎదురుగా వస్తున్న వాహనాలు ఢీ కొని ఒక డ్రైవరు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం స్థానిక ఐఎంఎఫ్ఎల్ డిపో నుంచి మద్యం కేసులతో డి.పోలవరం వెళ్తున్న టాటా ఏస్ వాహనాన్ని పిఠాపురం నుంచి వస్తున్న ఐషర్ వాహనం ఢీ కొనడంతో రెండు వాహనాలు దెబ్బ తిన్నాయి. టాటా ఏస్ వాహనంలో ఉన్న మద్యం కేసులు ధ్వసం కాగా, మద్యం వాహనం డ్రైవరు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతనిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన


ఉప ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ ఇతర అధికారులు

పిఠాపురం: ఈ నెల పదో తేదీన ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటన నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ షణ్మోహన్ వివిధ శాఖల అధికారులు, జనసేన పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. పిఠాపురం, గొల్లప్రోలు మండలాలోని మల్లంలోని గోకులం, విరవాడ, చేబ్రోలులో జెడ్పీ ఉన్నత పాఠశాలల మైదానం తదితర ప్రాంతాలను పరిశీలించి అక్కడి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 141 మంది ఎంపిక

బాలాజీచెరువు: బెంగళూరుకు చెందిన ప్రముఖ ఎంఎన్‌సీ సంస్థ యాక్సెంచర్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 141 మంది ఎంపికయ్యారని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు మంగళవారం తెలిపారు. డిగ్రీ విద్యార్హతతో ఎంపికైన వారికి ప్రారంభ దశలో ఏడాదికి రూ.3.5 లక్షల వేతనాన్ని సంస్థ చెల్లిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ అభినందించారు.

పరకే బంగారమాయె!

- ఎండు గడ్డికి భారీగా పెరిగిన గిరాకీ
- ట్రాక్టర్ వరిగడ్డి రూ.13 వేలకు పైనే
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు


కొత్తపల్లి మండలంలో యంత్రంతో వరి కోత

కొత్తపల్లి: వ్యవసాయంలో వచ్చిన సాంకేతికత పాడి రైతులకు ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. మెట్టలో సైతం రైతులు యంత్రాలతో వరికోతలు చేపట్టడంతో ఎండుగడ్డి దొరకడం లేదు. పశువులకు వరిగడ్డి కొరత ఏర్పడటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతాన్నారు. ఇతర ప్రాంతాల్లో గడ్డికొని దానిని ఇక్కడకు తెచ్చుకుంటున్నారు. ఫలితంగా ట్రాక్టర్ గడ్డికి రూ.12 నుంచి 15 వేలకు పైనే ఖర్చు అవుతోందని రైతులు వాపోతున్నారు.

నియోజకవర్గంలో 12 వేల హెక్టార్లలో..

పిఠాపురం నియోజకర్గంలో కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలుల్లో 12 వేల హెక్టార్లలో రైతులు సాగు చేశారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగి వరి గడ్డి కొరత ఏర్పడంతో పాడి రైతులకు కష్టాలు తప్పడం లేదు.

పశుగ్రాసం కొరత

గతంలో పాడి రైతులు పశువులను ప్రత్యేకంగా బీడు, మెట్ట, కొండ ప్రాంతాలకు తరలించి మేపుకొనేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనుమరుగైంది. యంత్రాల వినియోగంతో బీడు, మెట్ట, కొండ ప్రాంతాలను చదును చేసి సాగులోకి తీసుకురావడంతో పశువులకు గ్రాసం దొరికే పరిస్థితి లేకుండా పోయింది.

పశువుల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు
కొత్తపల్లి	1850	10300
పిఠాపురం అర్బన్	1180	3169
పిఠాపురం	2260	13138
గొల్లప్రోలు	2000	8200

కూలీల కొరతతో..

కూలీల కొరత, యంత్రాల వినియోగం వల్ల గడ్డి కొరత ఏర్పడుతోంది. కూలీలు దొరికినా కూలి ధరలు పెరగడం, యంత్రాలతో నిర్దిష్ట సమయంలో వరికొత, నూర్పిడి పనులు ఏకకాలంలో పూర్తి కావడంతో రైతులు ఎక్కువగా యంత్రాల పైనే మక్కువ చూపిస్తున్నారు. వీటితో ప్రతికూల వాతావరణంలో సైతం ఆరుగాలం పండించిన పంటను రక్షించుకోవడం సాధ్యమవుతుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరి కోతకు యంత్రాలను వినియోగించే రైతుల సంఖ్య భారీగా పెరగడంతో గడ్డి కొరత ఏర్పడిది. ఇతర మండలాలకు చెందిన పాడి రైతులు సైతం మండలంలో గడ్డిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో గడ్డికి డిమాండ్ పెరిగింది. గతంలో రూ.5 వేలు ఉన్న వరి గడ్డి ఈ ఏడాది రూ.7 వేలకు చేరుకుంది. కూలీలకు రూ.3000, రవాణా చార్జి కనీసం రూ.2500 అదనంగా చెల్లించాల్సి వస్తుంది. ట్రాక్టర్ గడ్డి ఇంటికి వచ్చేసరికి రూ.12 వేలకు పైగా అవుతుంది. ఎంత ధర అయినా చెల్లించి గడ్డి కొనుగోలు చేద్దామంటే దొరకని పరిస్థితి నెలకొందని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశుపోషణ భారంగా మారింది



“ప్రస్తుతం యంత్రాల వినియోగం వల్ల వరిగడ్డి కొరత ఏర్పడింది. ఎకరం పొలంలో వరిగడ్డి సుమారు రూ.4 వేలకు కొనాల్సి వస్తోంది. ట్రాక్టర్ గడ్డికి కూలీలు, రవాణా ఖర్చుతో కలిపి సుమారు రూ.12వేల నుంచి రూ.15 వేలు పైనే ఖర్చు అవుతుంది. దీంతో పాడి పశువుల పోషణ తలకు మించిన భారమవుతోంది.”

– కె.సత్యనారాయణ, కొమరగిరి, పాడిరైతు


ట్రాక్టర్‌పై తరలిస్తున్న వరిగడ్డి

విద్యార్థులకు ఆన్‌జాబ్ శిక్షణ


సెరికల్చర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు పట్టు పరిశ్రమ కేంద్రంలో మంగళవారం పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వొకేషనల్ విద్యార్థులకు ఆన్ జాబ్ ట్రైనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వి కేశవరావు మాట్లాడుతూ గత డిసెంబర్ 2 నుంచి ఈ ఏడాది జనవరి 8 వరకు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం వల్ల విద్యార్థులకు విద్యతో పాటు వృత్తిలో నైపుణ్యం పెరిగి వారి భవితకు ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణలో భాగంగా మల్బరీ కటింగ్, నర్సరీ బెడ్ల తయారీ, పట్టు మార్కెటింగ్, పట్టు దారం నాణ్యత, లోపాలు తెలుసుకోవడం చీరల తయారీ తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెరీకల్చర్ లెక్చరర్ జేబీవీఎస్ఎస్ఆర్ మాధవి, బి.నాగరాజు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు


విద్యార్థుల ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంబరాలను సీఐ ఎ.కృష్ణభగవాన్, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ప్రారంభించారు. సీఐ కృష్ణభగవాన్ మాట్లాడుతూ విద్యార్థులతో కలిసి సంక్రాంతి సంబరాలలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉన్నదని, తన చిన్నతనం గుర్తుకు వచ్చిందన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ డి.శ్రీహరిరాజు పర్యవేక్షణలో సంప్రదాయ సంక్రాంతి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ గాలి పటాలను ఎగుర వేసి విద్యార్థులలో ఉత్సాహం నింపారు. రంగ వల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నిమ్మకాయల కిరణ్, ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ ఇంజరపు సునీత తదితరులు పాల్గొన్నారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థికి అందిస్తున్న ఫిజియోథెరపీ చికిత్సను పరిశీలిస్తున్న ఎంఈఓ చౌదరి


శాంతివర్ధనలో సేవలను పరిశీలిస్తున్న జువైనల్ జస్టిస్ బృందం

పెద్దాపురం: విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి చౌదరి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్‌లో విభిన్న ప్రతిభావంతులకు అందిస్తున్న సేవలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చౌదరి మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతులకు విద్యా శాఖ ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు మెరుగైన వైద్య, విద్య సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థికి అందిస్తున్న ఫిజియోథెరపీని పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం శివజ్యోతి, ఫిజియోథెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతివర్ధన సేవలపై అధికారుల తనిఖీ

మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో మంగళవారం జువైనల్ జస్టిస్ యాక్ట్ బృందం తనిఖీలు నిర్వహించింది. జెజె యాక్ట్ 2015 ప్రకారం విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులతో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల తనిఖీల్లో భాగంగా బృందం సభ్యులు డీపీఓ చంద్రశేఖర్, డీసీపీఓ వెంకట్రావు, సీడీపీఓ ఉష, ఎల్‌సీపీఓ సుధాకర్, పీఏబీసీ శ్రీనివాస్ బృందం విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వారికి కల్పిస్తున్న వసతులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పులిమేరు ప్రధాన పాఠశాలతో పాటు తొండంగి మండలం కేఈ చిన్నాయిపాలెంలో (అన్నవరం నేషనల్ హైవే)లో నిర్వహిస్తున్న శాంతివర్ధన పాఠశాలను పరిశీలించినట్టు తెలిపారు. రెండు కేంద్రాల్లో సుమారు 150 మంది విభిన్న ప్రతిభావంతుల పాఠశాలకు సేవలందించడంతో వారికి మరిన్ని సేవలందించడంపై బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, ప్రిన్సిపాల్ ఆర్.సత్య, ఏఓ వేణు, బాబి, చంటి, శ్రీనివాస్, అప్పలరాజు సిబ్బంది పాల్గొన్నారు.

మాతృ హృదయ దాతృత్వం


సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రానికి దుప్పట్లు అందజేస్తున్న దాత నాగ ప్రసాద్

సామర్లకోట: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి పెద్దాపురానికి చెందిన ముత్యం నాగవరప్రసాద్ సుమారు రూ.30 వేల విలువ చేసే 120 బెడ్ షీట్లను బహూకరించారు. ఏడాదిన్నర క్రితం ఆయన భార్య రేష్మ ఈ ఆస్పత్రిలో ఆడ బిడ్డకు జన్మనిచ్చారు. ఆ సమయంలో వైద్యులు, సిబ్బంది చూపిన ప్రేమకు, చేసిన సేవలకు గుర్తుగా ఏదో ఒక విధంగా సాయం చేయాలని తలచారు. దీంతో ఆస్పత్రిలో ఉన్న 60 బెడ్‌లకు 120 బెడ్ షీట్లు ఏర్పాటు చేసి ఆస్పత్రి ఇన్‌చార్జి వైద్యాధికారి అమలకు అందజేశారు. ఆస్పత్రికి వచ్చే దివ్యాంగుల కోసం ఒక వీల్‌చైర్, దివ్యాంగుల స్టాండ్‌ను మరో దాత ఎస్.కోమలి ఏర్పాటు చేశారని డాక్టర్ అమల తెలిపారు. దాతలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి పూజలకు ఏర్పాట్లు


వేట్లపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

సామర్లకోట: ధనుర్మాసంలో వచ్చే ఏకాదశిని ముక్కోటి ఏకాదశిగా భావించి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా అతి పూరాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణస్వామి ఆలయం, పాత సామర్లకోటలోని వేణుగోపాలస్వామి ఆలయం, పెద్దాపురం రోడ్డులోని విఘ్నేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలోను, వేట్లపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోను ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆయా ఆలయాల వద్ద ప్రసాద వితరణకు ఆలయ కమిటీల నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అందరూ అక్షరాస్యులు కావాలి


శిక్షణ పొందిన వారికి పుస్తకాలను అందజేస్తున్న ఎంపీడీవో రవి కుమార్

కొత్తపల్లి: అందరినీ విద్యావంతులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఉల్లాస్ జిల్లా కో ఆర్డినేటర్ అనిశెట్టి వెంకటరెడ్డి అన్నారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం వలంటరీ టీచర్లకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారికి పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లు నిండిన అక్షరాలు రాని సమాఖ్య సభ్యులు, ప్రభుత్వ పాఠశాలలలో వంట చేస్తున్న, ఆయాలు, హెల్పర్లు, నైట్ వాచ్‌మెన్, అంగన్‌వాడీ హెల్పర్లు, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు చదువు నేర్పనున్నట్టు ఆయన తెలిపారు. వారికి విద్యా బోధనతో పాటు ఆర్థిక అక్షరాస్యతా, డిజిటల్ అక్షరాస్యత, క్రియాత్మక అక్షరాస్యతలపై వీడియోల ద్వారా అవగాహన కల్పిస్తూ మహిళల్లో సాధికారత సాధించేలా చేయనున్నట్టు తెలిపారు. గ్రామాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనాల్లో ప్రతిరోజు మధ్యాహ్నం తరగతులను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి


ధర్నా చేస్తున్న బాధితులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కాలేజ్ వద్ద ప్రమాద బాధితులు ధర్నా చేశారు. రెండు నెలల క్రితం గొల్లప్రోలు మండలం చందుర్తి గ్రామానికి చెందిన జీడిపెక్కల ఫ్యాక్టరీలో కూలీలు ఆటోలో చేబ్రోలు ఫ్యాక్టరీలో పనులు ముగించుకుని వెళుతుండగా ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాల బస్సు దుర్గాడ సెంటర్లో ఢీకొనడంతో గ్రామానికి చెందిన పిర్ల దేవి, పిర్ల వెంకటలక్ష్మి, అంజూరి గంగాభవానిలకు గాయాలయ్యాయి. పనికి వెళ్లే పరిస్థితి లేక వారి కుటుంబాలకు పూట గడవని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. దీంతో ఫ్యాక్టరీలో పనిచేసే సాటి కార్మికులు ఆదర్శ్ కాలేజీ గేటు ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. సంఘటన ప్రాంతానికి పోలీసులు చేరుకున్నారు.

కాలు దువ్వుతున్న కోళ్లు


కోడిపందాలకు సిద్ధమవుతున్న బరులు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేలకు బరులు సిద్ధమవుతున్నాయి. పోలీసుల ఆంక్షలు ఎలా ఉన్నా ఎవరి పని వారిదన్నట్టు నిర్వాహకులు కోళ్లను పందేలకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పందాలకు సంబంధించి కత్తులు కట్టే వారిని ముందస్తుగా బైండోవర్ చేసి హెచ్చరిస్తున్నారు. ప్రతి సంక్రాంతి ముందు ఈ హెచ్చరికలు మామూలేనని మండలంలో కొన్ని గ్రామాల్లో బహిరంగంగా, మరి కొన్ని గ్రామాల్లో లోపాయికారీగా పందేలకు ఏర్పాటు చేస్తున్నారు. పలు కొబ్బరి తోటలు, లేఅవుట్లు పందేలు ఆడేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పందెం కోళ్లను సిద్ధం చేస్తున్నారు.

హెచ్ఎంపీవీ ప్రత్యేక వార్డు

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో హెచ్ఎంపీవీ ప్రత్యేక వార్డు ఏర్పాటైంది. 22 పడకలతో ఈ వార్డును ఏర్పాటు చేశారు. జిల్లాలో హెచ్ఎంపీవీ జాడ లేదని అధికారులు వెల్లడించారు. అప్రమత్తత నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర కమిమీషనర్ జిల్లా వైద్యాధికారులతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ప్రజలను వైరస్ పట్ల అప్రమత్తం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ మాట్లాడుతూ కోవిడ్ తరహాలోనే సామాజిక దూరం, శానిటైజేషన్, కరచాలనాలకు స్వస్తి, పోషకాహారం, పరిశుభ్రత వైరస్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.

డ్వాక్రా సొమ్ము స్వాహాపై విచారణ


సంఘ సభ్యులను విచారిస్తున్న క్లస్టర్ కోఆర్డినేటర్ ప్రకాశమ్మ

కొత్తపల్లి: డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందించే రుణాలు పక్కదారి పట్టాయంటూ సంఘాల సభ్యులు చేసిన ఫిర్యాదులపై అధికారులు విచారణ చేపట్టారు. కొత్తపల్లి మహిళా సమాఖ్య క్లస్టర్ కోఆర్డినేటర్లు ప్రకాశమ్మ మంగళవారం గ్రామంలో విచారణ నిర్వహించారు. వీఓఏ గాయత్రికి సంబంధించిన డ్వాక్రా గ్రూపు సభ్యులను విచారించారు. ఇప్పటి వరకు చేసిన విచారణలో సుమారు రూ.8 లక్షలు పక్కదారి పట్టినట్లు తెలుస్తోందన్నారు. రుణాల పక్కదారిలో ఇటీవల పనిచేసిన క్లస్టర్ కో ఆర్డినేటర్ సూర్యనారాయణకు భాగస్వామ్యం ఉందని సభ్యులు ఆరోపిస్తున్నారు.

ఏడీబీ రోడ్‌లో ట్రాఫిక్ తనిఖీలు


ట్రాఫిక్ తనిఖీలు చేపడుతున్న పోలీసులు

కాకినాడ క్రైం: మంగళవారం కాకినాడ సామర్లకోట అనుసంధానం చేసే ఏడీబీ రోడ్‌లో పోలీసులు విస్తృత ట్రాఫిక్ తనిఖీలు చేపట్టారు. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ మార్గంలో ట్రాఫిక్ తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. తరుచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న రహదారి కాగా సామర్లకోట–కాకినాడ రోడ్డు మరమ్మతుల నేపథ్యంలో ఏడీబీ రోడ్‌లో మరింత ట్రాఫిక్ పెరిగిందని ఎస్పీ అన్నారు. నిబంధనలు అతిక్రమించిన పలువురు చోదకులపై కేసులు నమోదు చేశామన్నారు.

285 మందికి దేహదారుఢ్య పరీక్షలు


పరుగు పోటీలో అభ్యర్థులు

కాకినాడ క్రైం: కానిస్టేబుళ్ల ఎంపికకు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలకు మంగళవారం 285 మంది హాజరయ్యారు. ఏడో రోజు నిర్వహించిన ఈ పరీక్షల్లో 233 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరిగాయి.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పిఠాపురం: రాష్ట్రస్థాయి ఎన్‌పీఎం షాప్ యజమానుల శిక్షణలో భాగంగా ఐదో రోజు మండలం దొంతమూరులో ప్రకృతి వ్యవసాయంపై రైతు పాటి శ్రీను వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. 20 సెంట్ల భూమిలో ఏటీఎం మోడల్‌లో 22రకాలు ఆకుకూరలు, కాయకూరలు, తీగజాతి వేయంచి 4 టన్నుల ఘన జీవామృతం, బయోచారు తయారు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేట్ తిమటిక్ లీడ్ జానకి, బుజ్జిబాబు, జిల్లా కోఆర్డినేటర్ గణేష్, రిసోర్స్ పర్సన్ శివచక్రం ఎన్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కులగణన అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంపు

కాకినాడ సిటీ: ఎస్సీ జనాభాపై సోషల్ ఆడిట్‌పై అభ్యంతరాల స్వీకరణను 16వ తేదీ వరకు పొడిగించినట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం ఈనెల 20న కులగణన తుది వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు. పేరు, ఆధార్ నంబర్, పుట్టిన తేదీ, వయస్సు, ఉపకులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి వివరాలను ఆర్ఐకి నివేదిస్తారని, వీటిని ఆర్ఐ పునఃపరిశీలించి తహసీల్దార్‌కు సిఫారసు చేస్తారన్నారు. అనంతరం తుది ఆమోదం తెలిపి వివరాల్ని పోర్టల్‌లో పొందుపరుస్తామన్నారు. ఆ వివరాల్లో కచ్చితత్వాన్ని పెంపొందించేందుకు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో 50 మంది వివరాలన్ని ర్యాండమ్‌గా తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సోషల్ ఆడిట్‌ను కలెక్టర్, ఆర్డీవోలు పర్యవేక్షిస్తారని శ్రీనివాసరావు తెలిపారు.